

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

గుండుగొలను,
26-5-95

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జనులందరూ ఒకే విధంగా ప్రవర్తిస్తారని ఆశించకూడదు అని భగవాన్ చెపుతున్నారు. మనుషులు అందరూ ఒకలాగ ఉండరు. రకరకాలుగా ఉంటారు. వారి మనస్తత్వములు వేరుగా ఉంటాయి. వారి ప్రవృత్తులు వేరుగా ఉంటాయి. రకరకాల గుణములు, హెచ్చుతగ్గులు ఉంటాయి. అందరూ ఒకలాగ ఉండాలి అనుకుంటే ఎలా ఉంటారు అంటున్నారు భగవాన్. సత్యము ఒకటిగా ఉంటుంది గాని అసత్యము ఒకటిగా ఉండదు. అందువలన మనుషులు అందరూ ఒకే విధంగా ఉండాలని ఆశించకూడదు. అలా ఆశిస్తే మనదే పొరపాటు అవుతుంది.

మనుషులందరితోనూ సరిపెట్టుకొంటూ జీవితంతో రాజీపడాలి. అందరూ మనలాగే ఉండాలి అని అనుకుంటే ఎలా కుదురుతుంది. జీవితంతో రాజీ పడకపోతే రోజులు వెళ్ళవు. మనకు ఎంత ధనం ఉన్నా, అధికారం ఉన్నా జీవితంతో రాజీపడకపోతే రోజులు వెళ్ళవు. ఎంతో కొంత రాజీ పడాలి. రాజీపడకపోతే కుటుంబమే నడవదు. సరిపెట్టుకోవటం తప్పదు అంటున్నారు భగవాన్.

ఒకో మనిషిని ఒకో గుణం ఆడిస్తుంది. గుణాలనుబట్టి మనిషి ప్రవర్తన అలాగ ఉంటుంది. గుణాలు వేరైనా, ప్రవృత్తులు వేరైనా, రూపాలు వేరైనా, రంగులు వేరైనా లోపల ఉన్న పరమేశ్వరుడు ఒక్కడే. అందరిలోనూ ఉన్న పరమేశ్వరుని చూడటం నేర్చుకుంటే ఈ రంగులు,రూపాలు, గుణాలు మనిషిని ఆకర్షించవు. అప్పుడు వారిని చూసి రియాక్టు అవ్వము. మనం రియాక్టు అయితే ఎంతవరకు రియాక్టు అయ్యామో అంత వరకూ జీవితంలో నష్టపోతాము.

పూజ, జపము, ధ్యానము గమ్యం కాదు. ఇవి సాధనలు మాత్రమే. ఇవి అన్నీ జీవ లక్షణాలు పోగొట్టుకోవటానికే. వస్తువు మన హృదయంలోనే ఉంది. జీవలక్షణములను క్రమంగా తొలగించుకోవాలి. చాలామంది పూజ చేయటంవలన పుణ్యం వస్తుంది అనుకొంటారు. ఇది బాహ్యమునకు సంబంధించిన విషయము. పుణ్యం వస్తే రావచ్చును. అది అనుభవిస్తే పోతుంది. అంతకంటే ముఖ్యమైనది ఏమిటంటే మనస్సును నిగ్రహించుకోవటానికే పూజను మన పెద్దలు ఏర్పాటు చేసారు. నేను ఎవడను అనే ప్రశ్న కూడా మనోనిగ్రహానికే ఉపయోగపడుతుంది.

నీకు ఒక నేను ఉంది. ఈ నేను ఎవరు అని నిరంతరము నిన్ను నీవు ప్రశ్నించుకోవటం వలన నీకు నీవే మహోపకారము చేసుకొంటున్నట్లు లెక్క అన్నారు భగవాన్. నాకు నేను ఉపకారం చేసుకోవాలి అనుకుంటే

నాకు ఒక నేను ఉంది కదా. ఆ నేనును నిరంతరము ప్రశ్నించటం వలన నాకు నేను మహోపకారము చేసుకొన్నట్లు అవుతుంది.)

శరీరము మరణించటానికి సాధన అక్కరలేదు. శరీరము మరణించిన తరువాత ప్రయాణించే అహంకారము మరణించటానికే సత్సంగాలు, తపస్సులు. శరీరము మరణించేలోపు అహంకారము మరణించకపోతే శరీరము మరణించిన తరువాత అహంకారము ప్రయాణము చేస్తుంది. ప్రయాణం చేసిన తరువాత దానికి పునర్జన్మవస్తుంది. శరీరము మరణించిన తరువాత ఇష్టం ఉన్న వారు దుఃఖపడతారు. ఇష్టం లేని వారు సంతోషిస్తారు. ఈ శవానికి అదీ తెలియదు. ఇదీ తెలియదు.

జనులు అందరూ ఒకేలాగ ఉండాలి అని అనుకోకూడదు. అది వారి వారి మనోప్రవృత్తిని బట్టిఉంటుంది. గత జీవితాలను బట్టి ఉంటుంది. ఇప్పుడు ఈ శరీరము కనబడుతోంది. ఇంతకుముందు అనేక శరీరములలో ఈ జీవుడు ఉండి ఉంటాడు. పూర్వజన్మ గుణాలను బట్టి, ఆ గుణాల వేగమును బట్టి ఈ శరీరములో జీవితము నడుస్తూ ఉంటుంది. పూర్వజన్మలో గుణాలు మనకు తెలియక వీరు ఇలా ఉన్నారు ఏమిటి అనుకొంటాము.

భగవాన్ గాథలు చెప్పరు. అప్పటికప్పుడు బాగుపడే విధానము చెపుతారు. మనుషులు రకరకాలుగా ఉంటారు. గత జన్మను బట్టి అలా ప్రవర్తిస్తూ ఉంటారు. వారు ఇలా ఉన్నారు, వారు అలా ఉన్నారు అనే గొడవలలోనికి వెళ్ళకుండా మన పనిని మనం చూసుకోవాలి. మనం తరించటం చూసుకోవాలి అంటున్నారు భగవాన్. లోపలనుండి బయటకు వచ్చే మాటల విషయంలోనూ, బయట నుండి లోపలకు వెళ్ళే తిండి విషయములోనూ జాగ్రత్తగా ఉండాలి.

రూపధ్యానమువలన కూడా మనస్సుకు నిగ్రహం వస్తుంది. రూపమునకు మనస్సును ఆకర్షించే గుణం ఉంటుంది. ఇష్టమైన రూపమును ఆరాధిస్తే కూడా మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది.

నిజమైన గురువు మిమ్మలను చెడగొట్టడు. ఏ మార్గములో ప్రయాణం చేస్తున్నారో అందులోనే ముందుకు వెళ్ళేలా చూస్తాడు గాని ఉన్నది ఊడ గొట్టడు. మీ మార్గమును చెడగొట్టడు. ఏ రూపమును ధ్యానం చేసినా, ఏ నామమును స్మరించుకొన్నా, మీ విశ్వాసము హృదయపూర్వకంగా ఉండాలి. కపటం ఉండకూడదు. నటన ఉండకూడదు. విశ్వాసము హృదయపూర్వకంగా ఉంటే మీకు భారం తగ్గుతుంది. అనుకొన్న పని తేలికగా అవుతుంది. భగవంతుడు కలగజేసుకొంటాడు. కర్తృత్వబుద్ధి తగ్గుతుంది. టెన్షన్ తగ్గుతుంది. విశ్వాసము హృదయపూర్వకంగా ఉంటే అది డాక్టరు చెయ్యలేని పని కూడా చేస్తుంది. విశ్వాసమునకు అంతశక్తి ఉంది. (నాన్ మెంటల్‌గా పని చేయాలి అంటారు భగవాన్. మనం ఏదైనా పనిచేయాలి అనుకుంటే మనస్సు వచ్చి అనవసరంగా కలుగజేసుకొంటుంది. ఆ పనిని చెడగొడుతుంది. మనం ఏదైనా పని చేస్తూ ఉంటే ఇతరులు వచ్చి ఎక్కువగా కలుగజేసుకుంటే ఊరుకుంటామా? ఎక్కువగా కలుగజేసుకోవద్దు. ఏదైనా సలహా ఉంటే చెప్పండి. మా పనినిచేసుకోనివ్వండి అంటాము. అలాగ మన మనస్సుకు కూడా చెపుతూమంటున్నారు భగవాన్. మన మనస్సును ఒక ప్రక్కన పెట్టి మన పనిని చేసుకోవాలి. దానితో కలసి ఊరేగితే మన పనిని చెడగొడుతుంది. ఇతరులు చెడగొడుతున్నారు అని అనుకోవద్దు. నీ మనస్సే చెడగొడుతోంది. అందువలన దానిని ఒక ప్రక్కన కూర్చోబెట్టి మన పనిని చేసుకోవాలి. నాన్‌మెంటల్‌గా పనిచేసుకో అంటున్నారు భగవాన్.

నీ మనస్సు కలుగజేసుకోకుండా ఉంటే నీపని పూర్తి అవుతుంది. మనస్సును కలుగజేసుకోనివ్వకుండా చూస్తూ ఉంటే అది వెళ్ళి హృదయంలో పడిపోతుంది. మనకు సహజముగా ఉండాలి అని ఉంటుంది. సుఖంగా ఉండాలి అని ఉంటుంది. కాని మన మనస్సు అలా ఉండనివ్వటం లేదు. అందువలన మనస్సును కలుగజేసుకోనివ్వకుండా చూసుకోండి సరిపోతుంది అంటున్నారు భగవాన్. ముందు దాని గొడవ వదిలించుకోండి.

కొంత శిక్షణ ఉంటే గాని భక్తి కూడా రాదు. జీవితంలో నలగాలి. జీవితంలో ఎంతో కొంత క్రమశిక్షణ ఉంటేగాని భక్తిరాదు. అది లేనివాళ్ళకు ఎంతో తేలికగా అనిపిస్తుంది. అందులో ఏమిఉంది అనిపిస్తుంది. ఎంతకష్టపడితే అది వచ్చిందో వారికి తెలియదు.

రూపధ్యానము లేకుండా, మంత్రజపము లేకుండా ఆదిలోనే నీ మనస్సును తీసుకొని వెళ్లి సరాసరి హృదయంలో నిలబెట్టటం కష్టమే అంటున్నారు భగవాన్. అసాధ్యము అని చెప్పటం లేదు. కొద్దిగా కష్టమే అని చెపుతున్నారు. మనస్సును పవిత్రము చేయటానికే రూపధ్యానము, మంత్రజపము. ఈ ఉపాయములన్నీ మనోనిగ్రహానికే సద్వస్తువుకు రూపములేదు. కాని ఎవడి మనస్సును బట్టి వాడు ఊహించుకొంటూ ఉంటాడు. వాడి మనస్సును బట్టి దేవుడు ఇలా ఉంటాడు అని ఊహించుకొంటాడు. ఏదో ఒక రూపమును తీసుకొని ఉపాసన చెయ్యి. మీకు ఇష్టమైన రూపమును తీసుకొని ఉపాసన చెయ్యి. అలాకూడా తరించవచ్చు అన్నారు భగవాన్. (చనిపోయిన తరువాత ఎక్కడికి వెళతాను అని భగవాన్‌ను అడిగితే ఎక్కడికి వెళ్ళటానికైనా నీవు ఉండాలికదా. స్వర్గానికి వెళ్ళినా, నరకానికి వెళ్ళినా నీవు ఒకడవు ఉండాలికదా. నీవు లేకుండా స్వర్గములేదు, నరకములేదు. ఒకవేళ ఉన్నాయి అనుకో అవి స్వప్న సమానములు. శరీరము చనిపోకముందే జీవుడు చనిపోతే స్వర్గములోనికి, నరకములోనికి వెళ్ళనక్కరలేదు. అంతటా మీరు ఉంటారు. దేశము, కాలము అన్నింటిని దాటిపోతారు.)

మరణించిన తరువాత ఎక్కడికి వెళతాము అని బుద్ధుని అడిగితే మరణించిన తరువాత ఎవడైతే ప్రయాణం చేస్తాడు అని అనుకొంటున్నావో వాడు ఇప్పుడు కూడా లేడు. ఉన్నాడు అని అనుకొంటున్నావు. విచారణ చేస్తే వాడు ఇప్పుడు కూడా లేడు అన్న సంగతి తెలుస్తుంది. మరణానంతరము ప్రయాణం చేసేవాడు జీవుడు. జీవుడే నేనుగా వ్యక్తమవుతున్నాడు. కొద్దిగా విచారణ చేస్తే వాడులేడు. అన్న సంగతి ఇప్పుడే తెలుస్తుంది. అది తెలిస్తే మరణానంతరము ప్రయాణములు ఆగిపోతాయి. మీకు దేహము జ్ఞాపకం వచ్చినపుడే అహంకారము వస్తుంది. మీకు దేహము జ్ఞాపకం రాకపోతే అహంకారము రాదు. దేహం గుర్తు వచ్చేకొలదీ అహంకారము పెరుగుతూ ఉంటుంది. దేహం మర్చిపోయి పనిచేస్తూ ఉంటే అహంకారమునకు మేత దొరకదు. నెమ్మదిగా సన్నగిల్లిపోతుంది.

కుటుంబములో పదిమంది ఉన్నారు అనుకోండి. అందరూ మన వాళ్ళే అయినా కొంత మంది మీద ఇష్టం కలుగుతుంది. ఎందుకంటే చెప్పలేము. అది జన్మాంతర అనుబంధము. మనలో ఏమి ఉందో మనకు తెలియదు. మన మనస్సును నేను అనుకోకుండా దానిని ఒక వస్తువుగా చేసి చూస్తే దానిలోని గొడవలు తెలుస్తాయి. దానిని విశ్లేషణ చేసి చూస్తే దానిలోని గొడవలు తెలుస్తాయి.

ఈశ్వరుడు హృదయవాసి. ఆయన మన హృదయంలో ఉండి మనకు తెలియబడాలి అని ఎలా అనుకొంటున్నాడో అలాగ మనకు కూడా ఆయనను తెలుసుకోవాలి అని ఉంటే ఆయన తెలియబడతాడు. ప్రేమ అనేది రెండు వైపులా ఉండాలి. అప్పుడు ఆటోమేటిక్‌గా పనిజరుగుతుంది.

చైతన్యము అనుభవంలోనికి రాకుండా ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన. బలహీనతలు తొలగించుకోవటానికి బహు జాగ్రత్త అవసరము అన్నారు భగవాన్. మనకు ఏ బలహీనత ఉందో ఆ బలహీనత లేనివాళ్ళతో సహవాసము చెయ్యాలి. ఆ బలహీనత ఉన్నవాళ్ళతో సహవాసము చేస్తే అది పెరిగిపోతుంది. ఎటువంటి సందర్భాలలో ఆ బలహీనత ప్రకోపిస్తోందో ముందు నీకు తెలుస్తూ ఉంటుంది కదా అప్పుడు ముందు జాగ్రత్త పడితే ఆ బలహీనత సన్నగిల్లుతుంది.

మందుల షాపులో అనేక రకాల మందులు ఉంటాయి. అవి అన్నీ మనం కొనుక్కోము. మన రోగం తగ్గటానికి కావలసిన మందులు కొనుక్కొంటాము. అలాగే మీలో ఏ బలహీనత ఉందో చూసుకోండి. ఆ బలహీనత తొలగించుకొనే ముందు జాగ్రత్తలు తీసుకోండి అంటున్నారు భగవాన్.

వస్తువు మన హృదయంలోనే ఉంది. తెలిసిన వాడికీ ఉంది, తెలియని వాడికీ ఉంది. ధనవంతుడికీ ఉంది. దరిద్రుడికీ ఉంది. అందరి హృదయములలోనూ ఉంది. ఇది తెలిస్తే సుఖము. తెలియకపోతే దుఃఖము. అంతకన్నా తేడా ఏమీలేదు. అది తెలిసినవాడికి బహుదగ్గరగా ఉంది. తెలియనివాడికి బహుదూరంగా ఉంది అని భగవాన్ చెపుతూ ఉండేవారు.

ఉన్న వస్తువు ఒక్కటే. అది తప్ప మిగిలినవన్నీ మనస్సు కల్పితములే. ఇవి అన్నీ కాల ప్రవాహములో కొట్టుకొనిపోతాయి. కాల ప్రవాహము కంటే అతీతముగా ఉన్నది చైతన్యము ఒక్కటే.

భూకంపముల వలన వచ్చే బాధలకంటే, గాలివానల వలన వచ్చే బాధలకంటే, వరదలవలన వచ్చే బాధలకంటే మనస్సు కల్పించిన బాధలే ఎక్కువగా ఉంటాయి. నేను చెప్పాను అని నమ్మవద్దు. మీరు ఆలోచించుకోండి. ప్రకృతిపరంగా, సమాజపరంగా వచ్చే సమస్యలకంటే మన మనస్సు కల్పించే సమస్యలే ఎక్కువగా ఉంటాయి.

నేనును విచారణ చేసి తొలగించుకో అని భగవాన్ చెప్పారు. ఇది అబద్ధమైన నేను. నీ వివేకముతో ఈ నేనును విచారణచేసి తొలగించుకో అన్నారు భగవాన్. ఇది జ్ఞాన మార్గము.

విచారణ ద్వారా నేనును తొలగించుకొనే శక్తి నీకు లేకపోతే ఈ నేనును భగవంతునికి ఇచ్చివేయి అన్నారు రామకృష్ణుడు. ఇది భక్తి మార్గము.

మన ఇంటిలో నాలుగు మామిడిపండ్లు ఉన్నాయి అనుకోండి. ఎవరైనా వస్తే వారికి ఇచ్చేటప్పుడు నాలుగింటిలో చెడ్డది ఇస్తాము. మిగిలిన మూడు ఉంచుకొంటాము. మీ ఇంటిలో చూసుకుంటే మీకే తెలుస్తుంది. అలా ఎందుకు అనిపిస్తుంది అంటే ఆ ఉపాధి వేరు, మన ఉపాధి వేరు అని మనకు అనిపిస్తుంది.

జ్ఞానం పొందినవారు ఒకేపని చేయాలని ఎక్కడా లేదు. ఒకో ఉపాధి ద్వారా ఒకో పని జరుగుతుంది. కృష్ణుడు చేసిన పని వేరు, రాముడు చేసిన పని వేరు. అక్కడా జ్ఞానం ఉంది, ఇక్కడా జ్ఞానం ఉంది. లోపల ఉన్న వస్తువు ఒక్కటే. అనుభవం ఒక్కటే.

గురువు అంటే దేహము కాదు. గురువు అంటే చైతన్యమే. కృష్ణుడు దేవుడు అంటే కృష్ణుని దేహము దేవుడు అని కాదు. మన శరీరములు ఎలా శవాలు అవుతాయో కృష్ణుని దేహము కూడా శవం అయ్యింది. కృష్ణునిలో ఉన్న చైతన్యము దేవుడు. మనకు ఏ తలంపు వస్తే ఆ సమయంలో అదే నిజం అనిపిస్తుంది. దేవుడు లేడు, పునర్జన్మలు లేవు, ప్రపంచము లేదు అనిపిస్తుంది. ఆ సమయంలో ఏ ప్రవృత్తి వస్తే అది ఒక్కటే నిజం ఇంకేమీ లేదు అనిపిస్తుంది.

స్వర్గము, నరకము అనేవి నీలోని గుణములను బట్టి వస్తున్నాయి. నీలోని గుణములను తొలగించుకుంటే స్వర్గము లేదు, నరకము లేదు. నీవు నీవుగానే ఉంటావు. నీవు ఎంతసేపు స్వర్గము గురించి, నరకము గురించి ఆలోచిస్తున్నావుగాని నీలోని గుణముల గురించి ఆలోచించటం లేదు. నీలోని గుణములను తొలగించుకుంటే స్వర్గము లేదు, నరకము లేదు.

బాహ్యపరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా సమానంగా ఉండటానికి ప్రయత్నించు. జీవుడు దేహము ద్వారా ఏ అనుభవాలు పొందాలో అవి పొందాక దేహమును విడిచిపోతాడు. అదే చావు అంటారు.

తల్లి కడుపునుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంనకు వెళ్ళేవరకూ ఏ ఒక్కడి జీవితమూ సమానంగా వెళ్ళదు. చాలా హెచ్చు తగ్గులు ఉంటాయి. బాహ్యంగా చూస్తే ఈ హెచ్చు తగ్గులకు ప్రాముఖ్యత ఉందిగాని ఆత్మజ్ఞానము దృష్టిలో పెట్టుకొని చూస్తే వీటికి ప్రాముఖ్యత లేదు. ఇతరులకు వచ్చిన అనుభవంను నేను తీసుకోలేను. మీరు ఏదైనా మంచి మాట చెప్పారు అనుకోండి. ఆ మంచి మాటను నేను తీసుకోలేను. తగలవలసిన నాలుగు మొట్టికాయలు తగిలితేనేగాని నాకు బుద్ధిరాదు. కొంతమంది ఇతరుల అనుభవంను సొంతము చేసుకొంటారు వారు వివేకవంతులు. ఆధ్యాత్మిక మార్గములో మెదడు కంటే హృదయం చాలాముఖ్యము. అనుభవంను మనిషి హృదయంలోనే పొందుతాడు. హృదయం అంటే భౌతికమైన హృదయం కాదు. ఆధ్యాత్మిక హృదయం. ఈ హృదయం యొక్క లోతులు పెంచుకోవాలి. హృదయం యొక్క లోతులలోనికి దిగితే సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. ఇప్పుడు దేహము నేనుగా ఎలా వ్యక్తమవుతోందో హృదయం యొక్క లోతులలోనికి దిగినపుడు లోపల ఉన్న పరమేశ్వరుడు నేనుగా నీకు వ్యక్తమవుతాడు. భగవాన్‌తో మీరు చాలా పైకి వెళ్ళారు అని అంటే నేను పైకి వెళ్ళలేదు, లోపలికి వెళ్ళాను అని చెప్పేవారు. పరమేశ్వరుడు పైన లేడు. నీ హృదయంలో ఉన్నాడు. ఆయనను తెలుసుకొన్నాక తెలుస్తుంది ఈయనే అంతటా ఉన్నాడు. అంతటా ఉన్నవాడు ఇక్కడా ఉన్నాడు. ఆయనకు, ఈయనకు బేధంలేదు అన్న సంగతి తెలుస్తుంది.

ఎవరైనా పొగిడితే సంతోషము వచ్చి, ఎవరైనా విమర్శిస్తే దుఃఖము వస్తూ ఉంటే వారికి దేహాభిమానం ఎక్కువగా ఉన్నట్లు గుర్తు. దేహాభిమానమే బంధము. అందరూ సాధన చేయాలనుకొంటున్నారు,

మోక్షమును పొందాలనుకొంటున్నారు. ఈ గొడవలు ఏమీ లేకుండా ఇప్పుడు ఎలా ఉన్నారో అలా ఉంటే వచ్చే నష్టం ఏమిటి? ఇప్పుడు మనం ఉన్న స్థితి నిజమైన స్థితికాదు. యదార్థమైన స్థితి కాదు. ఇదే నిజమైన స్థితి అయితే దానికి సంబంధించిన ఆనందము మనకు తెలుస్తూ ఉంటుంది. మనం ఉన్నది నిజమైన స్థితికాదు. ఎందుకంటే మనకు వేదన వస్తోంది, దుఃఖము వస్తోంది, రోదన వస్తోంది. అందువలన ఇది నిజమైన స్థితి కాదు. మనకు నిజమైన స్థితి గురించి తెలియకపోయినా ఇప్పుడు మనం ఉన్నస్థితి నిజమైన స్థితికాదు అని తెలుస్తోంది. మనం ఉన్నస్థితి నిజమైన స్థితి అయితే సాధన అక్కరలేదు. మనం ఉన్న స్థితి నిజమైనది కాదు అని తెలుస్తోంది కాబట్టి సాధన చేయాలనుకొంటున్నాము. హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చాక అది మీకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. అప్పుడు పుస్తకాలతో పనిలేదు. గురువులతో పనిలేదు. ఈశ్వరుడిమీద భక్తి ఉండాలి. ప్రేమ ఉండాలి. కారణం కనబడకూడదు. మనకు అటువంటి భక్తి ఉంటే ఆయన తెలియబడతాడు. కోరికతో చేయకూడదు. భక్తిని కోరికకు పరిమితం చేయకూడదు. అడిగిన వాడికి అడిగినదే ఇస్తాడు. అడగని వాడికి ఏమీ ఇవ్వడు అని అనుకోవద్దు. మొత్తం అన్నీ ఇస్తాడు. అందువలన అడగటంకంటే అడగకుండా ఉండటం మంచిది.

కొంతమంది ఈ మధ్య మాకు అశాంతిగా ఉంది అని చెపుతూ ఉంటారు. అశాంతిగా ఉండనివ్వండి. మీకు వచ్చే నష్టం ఏమిటి? అశాంతిగా ఉండటం ఎవరికీ ఇష్టం ఉండదు. ఎందుకంటే మీస్వరూపములో అశాంతి లేదు. మీ స్వరూపంలో ఉన్నది శాంతి. అందుచేత అశాంతి వస్తే ఇష్టం ఉండటంలేదు. యాత్రలగురించి, నదులలో మునగటం గురించి కబీరును అడిగితే వారికి ఒక చేదు బీరకాయను ఇచ్చి మీతోపాటు దీనిని తీసుకొని వెళ్ళండి. మీరు నదులలో మునిగినపుడు దీనిని కూడా ముంచండి. మీరు ఏమి చేసినా దీనిని మీకూడా ఉంచుకోండి అని చెప్పాడట. వారు అన్నీ పూర్తి చేసుకొని కబీరు దగ్గరకు వచ్చి మీరు చెప్పినట్లే చేసాము మీరు ఇచ్చిన బీరకాయ ఇదిగో అని ఇచ్చారట. అప్పుడు కబీరు ఆ బీరకాయ ఎలా ఉందో చూడమని చెప్పారట. చేదుగానే ఉంది అని వారు అన్నారట. అప్పుడు కబీరు మీపనికూడా అంతే. మార్పు అనేది లోపలనుండి రావాలి. బాహ్యముగా ఈ శవమును తీసుకొని వెళ్ళి నదులలో ముంచటం కాదు. మార్పులోపల నుండి రావాలి అని చెప్పాడట. పౌడరు రాసుకొన్న అందం ఎక్కడ నిలబడుతుంది. ఎండలోనికి వెళితే కరిగిపోతుంది. స్వభావములో మార్పు రావాలి. పైన అంటించుకొన్నట్లు ఉంటే ఎంత కాలము ఉంటుంది. కొంతమంది అంటించుకొన్నట్లు మాట్లాడతారు. హృదయంలో ఏమీ ఉండదు. కొంతమందికి అసలు హృదయగతమైన జీవితమే ఉండదు.

గొడవలు అన్నీ ఎవరికి అంటే మనసుకి. అది మనం కాదు అన్న సంగతి తెలిస్తే అప్పటికప్పుడు ఆరిపోతాయి. నీరు పెట్టి ఆర్పనక్కరలేదు.